ఘనంగా 'జాతీయ క్రీడా దినోత్సవం'

పోటీలను ప్రారంభించిన కలెక్టర్

కామారెడ్డి, ఆగస్టు 29 : ధ్యాన్ చంద్ జయంతి, జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో హాకీ, బ్యాడ్మింటన్ తదితర క్రీడా పోటీలను కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ గురువారం ప్రారంభించారు. అంతకముందు ఇందిరాగాంధీ స్టేడియంలో ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో డీఈవో రాజు, హాకీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నీలం లింగం, ఆర్గనైజింగ్ సెక్రటరీ మధుసూదన్ రెడ్డి, అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, జిల్లా క్రీడల అధికారి జగన్నాథం, వ్యాయామ ఉపాధ్యాయులు రంగ వెంకటేశ్వర్‌గౌడ్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

వ్యాపారిని హత్య చేసినవారిని శిక్షించాలి

ఎస్పీ సింధూశర్మకు వినతిపత్రం అందజేస్తున్న చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

కామారెడ్డి, ఆగస్టు 29 : కామారెడ్డిలోని శివాలయం వద్ద వ్యాపారి పాత విశ్వనాథంను హత్య చేసినవారిని శిక్షించాలని గురువారం చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో ఎస్పీ సింధూశర్మకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాపారిపై కక్షపూరితంగా దాడి చేశారని అన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, వ్యాపారస్తులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కంచర్ల లింగం, ప్రతినిధులు శ్రీనివాస్, శ్రీనివాస్, గౌరీ శంకర్, కుంబాల రవి యాదవ్, ముప్పారపు ఆనంద్ పాల్గొన్నారు.

ఓపెన్ కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచాలి

మాట్లాడుతున్న డైరెక్టర్ ఆనంద్ పవర్

కామారెడ్డి, ఆగస్టు 29 : జిల్లా కేంద్రంలోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధ్యయన కేంద్రాన్ని డైరెక్టరేట్ ఆఫ్ స్టాఫ్ ట్రైనింగ్ అండ్ డెవలప్‌మెంట్ డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆనంద పవర్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్టడీ సెంటర్‌లో విద్యార్థుల సంఖ్యను పెంచాలని సూచించారు. విద్యార్థులను ఆకర్షించే వినూత్నమైన కార్యక్రమాలను చేపట్టాలన్నారు. సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, కళాశాల కోఆర్డినేటర్ సుధాకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తీసుకోవాలి

మాచారెడ్డి, ఆగస్టు 29 : వినాయక విగ్రహాలను ప్రతిష్టించే వారు మండపాలకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై అనిల్ నిర్వాహకులకు సూచించారు. పోలీస్ స్టేషన్‌లో పీస్ కమిటీ సమావేశాన్ని గురువారం నిర్వహించారు. డీజేలకు పర్మిషన్ లేదన్నారు. వినాయక మండపాల వద్ద కనీసం ఇద్దరు వ్యక్తులు ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్సై యూసుఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు

కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కామారెడ్డి, ఆగస్టు 29 : తెలంగాణ డ్రగ్స్ ఫ్రీ తెలంగాణ కావాలని విద్యార్థి సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు శివప్రసాద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డ్రగ్ ఫ్రీ తెలంగాణ కోసం మేము సైతం అంటూ కామారెడ్డిలోని యంగ్ సైరన్ ర్యాలీ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. కార్యక్రమంలో టీఎన్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడు వినయ్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కిష్టయ్య, అధ్యాపకులు రాజ్‌గంబీర్, సుధాకర్, చంద్రశేఖర్, విద్యార్థి సేన నాయకులు సాయి, రోహిత్, మహేశ్, దీపక్, విద్యార్థులు పాల్గొన్నారు.

బీబీపేట్, భిక్కనూరు మండలాల్లో..

బీబీపేట్/భిక్కనూరు, ఆగస్టు 29 : బీబీపేట్ మండలం యాడారం, శివారు రాంరెడ్డిపల్లి గ్రామాల్లో మన ఊరు మేము సైతం ఆధ్వర్యంలో గురువారం మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీబీపేట ఎస్సై ప్రభాకర్, పోలీస్ సిబ్బంది పాల్గొని విద్యార్థులు, గ్రామస్తులకు మత్తు పదార్థాలు, వాటితో కలిగే నష్టాల గురించి వివరించారు. గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రవీందర్, సాయిలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. భిక్కనూరు మండలం కాచాపూర్‌లోని ఉన్నత పాఠశాల విద్యార్థులకు మత్తు పదార్థాలపై ఇంపాక్ట్ ట్రైనర్ రమేశ్ చైతన్య అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర రావు, ఉపాధ్యాయులు సుభాన్ రెడ్డి, శైలజ, శేఖర్, చాంగుబాయి, ప్రియా, అరవింగ్ పాల్గొన్నారు.

సర్వే వేగవంతం చేయాలి

బాన్సువాడ రూరల్, ఆగస్టు 29 : గ్రామ పంచాయతీ వార్డుల వారీగా ఓటర్ సర్వేను వేగవంతంగా చేపట్టి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని బాన్సువాడ ఆర్డీవో రాథోడ్ రమేశ్ బూత్ లేవల్ అధికారులకు (బీఎల్‌వో) సూచించారు. మండలంలోని బోర్లం గ్రామంలో ఆయన గురువారం ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఓటర్ లిస్టు సర్వేపై ఇంటింటికీ వెళ్లి సర్వేపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలు ఇంటికి వచ్చి సర్వే చేశారా..? అని గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. 18 ఏండ్లు నిండిన వారు తప్పని సరిగా ఓట హక్కు పొందాలని సూచించారు. మృతి చెందిన వారి పేర్లను ఓటర్ లిస్టు నుంచి తొలగించాలని బీఎల్‌వోలకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వరప్రసాద్, గ్రామ పంచాయతీ కార్యదర్శి సాయికుమార్, జూనియర్ అసిస్టెంట్ అశోక్, కారోబార్ భాస్కర్‌రావు తదితరులు ఉన్నారు.

సర్వే గురించి తెలుసుకుంటున్న ఆర్డీవో రాథోడ్ రమేశ్

ఎంపీడీవో కార్యాలయం సందర్శన

నస్రుల్లాబాద్, ఆగస్టు 29 : మండల కేంద్రంలోని సమీకృత మండల కార్యాలయ భవన సముదాయంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని జడ్పీ సీఈవో చందర్‌నాయక్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా 2024 గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ స్టేట్‌మెంట్‌ను పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ భూములను ఎంత వరకు సర్వే చేశారని ఆరా తీశారు. ఆయన వెంట ఎంపీవో సూర్యకాంత్ ఉన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీసీఈవో

కారు ఢీకొని ఒకరి మృతి

కామారెడ్డి రూరల్, ఆగస్టు 29 : కామారెడ్డి మండలం క్యాసంపల్లి హైవే వద్ద కారు ఢీకొనడంతో ఒకరు మృతి చెందారని దేవునిపల్లి ఎస్సై రాజు తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. చిన్నమల్లారెడ్డికి చెందిన రాజశేఖర్(28) బైక్‌పై కామారెడ్డి వైపు వెళ్తున్నాడు. వెనుక నుంచి వచ్చిన కారు బైక్‌ను ఢీకొనడంతో రాజశేఖర్ మృతి చెందినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివరాల సేకరణ

భిక్కనూరు, ఆగస్టు 29 : మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించారు. రూ.రెండు లక్షలలోపు రుణ మాఫీ కానీ రైతుల ఇండ్లకు వెళ్లి వారి కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారులు రాధారెడ్డి, ఏఈవో వినోద్ గౌడ్ ఉన్నారు.

రోగులకు ఐవీ సెలైన్లు పెట్టొద్దు

నస్రుల్లాబాద్, ఆగస్టు 29 : రోగులకు ఐవీ సెలైన్లు, యాంటి బయోటిక్ ఇవ్వకూడదని ఎంపీవో సూర్యకాంత్ అన్నారు. మండల కేంద్రంలోని పీఎంపీ, ఆర్ఎంపీల వద్దకు గురువారం వెళ్లి క్లీనిక్‌లో కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. అనంతరం గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజేశ్, ఏఎన్ఎం వెంకటలక్ష్మి ఉన్నారు.

రేపు జాబ్ మేళా

కామారెడ్డి, ఆగస్టు 7 : జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుసూదన్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లోని రూమ్ నంబర్ 121లో జిల్లా ఉపాధికల్పనా కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కామారెడ్డిలోని ప్రముఖ అన్నపూర్ణ ఫైనాన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లో పలు పోస్టుల కోసం ఉద్యోగమేళా నిర్వహిస్తున్నారని తెలిపారు. అభ్యర్థులు బయోడేటాతోపాటు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఫొటోలతో హాజరు కావాలని, మరిన్ని వివరాలకు 9393733356,7671974009 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సమస్యలను పరిష్కరించాలి

తహసీల్దార్‌కు ఫిర్యాదులను అందజేస్తున్న నాయకులు

రాజంపేట్, ఆగస్టు 29 : కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి ప్రజల సౌకర్యార్థం ఫిర్యాదుల పెట్టెలను ఏర్పాటు చేయించారు. ఇందులో మండలానికి సంబంధించిన రెవెన్యూ, రేషన్ కార్డులు, ధరణి తదితర సమస్యలను పరిష్కరించాలని పెట్టెలో వేసిన ఫిర్యాదులను బీజేపీ మండల నాయకులు గురువారం తహసీల్దార్‌కు అందజేశారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్ రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సంపత్ రెడ్డి, నాయకులు సంతోష్, రాము, రమేశ్, మనోహర్ రెడ్డి, సాయిరెడ్డి, బాల్‌సర్సు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

గజ్యానాయక్‌తండాలో తీజ్ వేడుకలు

మాచారెడ్డి, ఆగస్టు 29 : మండలంలోని గజ్యానాయక్‌తండాలో గురువారం తీజ్ వేడుకలను నిర్వహించారు. పెండ్లి కాని యువతులు గోధుమ విత్తనాల మొలకలను ఎత్తుకొని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల తండా వాసులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లోని గోల్కొండ హోటల్‌లో 35వ తెలంగాణ ఆగ్రో బోర్డు కమిటీ సమావేశంలో పాల్గొన్న కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్
– బాన్సువాడ, ఆగస్టు 29

కవితను కలిసిన మాజీ జడ్పీటీసీ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను నాగిరెడ్డిపేట మాజీ జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లో కలిశారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఉత్నూర్ మాజీ జడ్పీటీసీ చారులత ఉన్నారు.
- నాగిరెడ్డిపేట, ఆగస్టు29

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

రామారెడ్డి, ఆగస్టు 29: అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందిన ఘటన అన్నారం గ్రామ శివారులో గురువారం వెలుగుచూసింది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లంపేటకు చెందిన భూక్యా శంకర్(35)తో భార్య రెండు రోజుల క్రితం గొడవపడి తల్లిగారిల్లు అన్నారం వచ్చింది. ఆమె కోసం శంకర్ బుధవారం అన్నారం వచ్చాడు. అక్కడి నుంచి కట్టెల కోసం అని వెళ్లి తిరిగి రాలేదు. అన్నారం గ్రామ శివారులోని కల్వర్టు వద్ద అతడి మృతదేహాన్ని గురువారం కనుగొన్నారు. మృతుడి అన్న రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

మహాధర్నా పోస్టర్ల ఆవిష్కరణ

ఎల్లారెడ్డి, ఆగస్టు 29: సమస్యల సాధన కోసం సెప్టెంబర్4న చలో విద్యుత్ సౌధ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఉద్యోగులు తెలిపారు. ఎల్లారెడ్డిలోని డీఈఈ కార్యాలయ ప్రాంగణంలో ఇందుకు సంబంధించిన గోడ ప్రతులను గురువారం ఆవిష్కరించారు. ప్రతి ఉద్యోగి పాల్గొని విద్యుత్ సౌధ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరారు.

చదువుతోనే సమాజంలో గుర్తింపు

ఎల్లారెడ్డి/ నాగిరెడ్డిపేట, ఆగస్టు 29: కష్టపడి చదువుకుంటేనే సమాజంలో గుర్తింపు, ప్రోత్సాహం లభిస్తుందని ఎల్లారెడ్డి విద్యాశాఖ అధికారి వెంకటేశం అన్నారు. గత సంవత్సరం ఎస్సెస్సీలో 9.2 జీపీఏ సాధించిన ఎల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినికి గోర్తి ఈశ్వర్ ట్రస్ట్ సభ్యులు సమకూర్చిన పది వేల రూపాయల చెక్కును గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ.. మల్లయ్యపల్లి గ్రామానికి చెందిన జింక సురేఖ ఎస్సెస్సీలో ప్రతిభ చూపగా.. ట్రస్ట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డి ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాజిర్, లింగమూర్తి, దేవదాస్, స్వాతి, మాధవి, అనిత పాల్గొన్నారు. గోపాల్‌పేట ఉన్నత పాఠశాలలో ఎస్సెస్సీ ఫలితాల్లో టాపర్‌గా నిలిచిన ఉదయ్‌కిరణ్‌కు గోర్తి ఈశ్వర ట్రస్టు ఆధ్వర్యంలో రూ.పదివేల నగదును అందించినట్లు హెచ్ఎం వెంకట్‌రెడ్డి తెలిపారు. ఇదే పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసిన ఉషాబాల ట్రస్టు ఆధ్వర్యంలో 15ఏండ్లుగా టాపర్లకు రూ.పదివేల ప్రోత్సాహకాన్ని అందజేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, సభ్యులు నాజర్, రాజశేఖర్ చౌదరి, ఉపాధ్యాయుడు అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి చెక్కును అందజేస్తున్న ఎల్లారెడ్డి ఎంఈవో వెంకటేశం, గోర్తి ఈశ్వర్ ట్రస్ట్ బాధ్యులు

ఉపాధి పనుల పరిశీలన

నిజాంసాగర్, ఆగస్టు 29: మండలంలోని మంగ్లూర్, నర్సింగ్‌రావుపల్లి గ్రామాలను ఎంపీడీవో గంగాధర్ గురువారం సందర్శించారు. ఆయా గ్రామాల్లో ఉపాధి పనులు, ఓటర్లు లిస్టు విభజన ప్రక్రియలను పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు రమ్య, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు పిచికారీ

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29: నాగిరెడ్డిపేటలో గ్రామస్తుల సహకారంతో గడ్డి నివారణ మందును పిచికారీ చేసినట్లు నాయకుడు లక్ష్మణ్ ఠాగూర్ గురువారం తెలిపారు. వ్యాధులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా గ్రామ కార్యదర్శి పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు మన్నె లక్ష్మణ్, షకీల్, నర్సింహులు, కిష్టయ్య పాల్గొన్నారు.

ప్రైవేటు దవాఖాన సీజ్

రామారెడ్డి, ఆగస్టు 29: రామారెడ్డిలోని ఓ ప్రైవేటు దవాఖానను మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సురేశ్ గురువారం సీజ్ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం మండలంలోని పలు ప్రైవేటు దవాఖానలను మెడికల్ ఆఫీసర్ తనిఖీ చేశారు. రామారెడ్డిలోని దత్తయ్య దవాఖానలో పలువురికి సెలైన్లు పెట్టడంతో పాటు ఓవర్‌డోస్ ఇంజెక్షన్లు ఇస్తున్నట్లు గుర్తించారు. ఇందుకు సంబంధించిన నివేదికను జిల్లావైద్యాధికారికి అందజేశారు. డీఎంహెచ్‌వో ఆదేశాలతో డాక్టర్ దత్తయ్య దవాఖానను సీజ్ చేసినట్లు తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే నిర్వహించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో హెచ్ఈ జార్జ్, రామారెడ్డి ఏఎస్సై లచ్చిరాం నాయక్, ఫార్మాసిస్టు రాజు, వైద్య సిబ్బంది శ్రీహరి పాల్గొన్నారు.

దవాఖానను సీజ్ చేస్తున్న అధికారులు

విద్యార్థుల కోసం బస్సు ఏర్పాటుకు కృషి

నమస్తే కథనంపై ఎమ్మెల్యే ఆరా

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29: గోపాల్‌పేట ఆదర్శ పాఠశాల విద్యార్థుల ఆర్టీసీ బస్సు ఇబ్బందులను పరిష్కరించేదుకు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కృషి చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ గువారం తెలిపారు. ఈనెల 27న నమస్తే తెలంగాణ దినపత్రికలో 'బస్సు వచ్చేదెప్పుడు..గమ్యం చేరేదెప్పుడు' అనే శీర్షికతో కథనం ప్రచురితం అయ్యింది. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు బాన్సువాడ ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడారని చెప్పారు. బస్సుల కొరత ఉందని చెప్పడంతో.. కొత్తగా ఐదు బస్సుల మంజూరు కోసం రవాణాశాఖ మంత్రితో మాట్లాడారని తెలిపారు. రెండు నెలల్లో నియోజకవర్గంలోని విద్యార్థులకు బస్సు ఇబ్బందులు లేకుండా చేస్తామని మాట ఇచ్చినట్లు చెప్పారు. ప్రస్తుతం మెదక్ ఆర్టీసీ డీఎంతో మాట్లాడి ఒక బస్సులను నాగిరెడ్డిపేట మండల కేంద్రం, గ్రామాల మీదుగా నడపాలని సూచించారన్నారు.

రైతులు అధైర్య పడొద్దు..

రుణమాఫీ కాని రైతులు అధైర్య పడొద్దని, వ్యవసాయాధికారులు ఇంటి వద్దకు వచ్చి వివరాలు తీసుకుంటారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు రాంచంద్రారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో వారు గురువారం విలేకరులతో మాట్లాడారు. అర్హులందరికీ రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వం కృషిచేస్తుందన్నారు. సెప్టెంబర్ 17 నుంచి గ్రామాల్లో ప్రజాపాలన సర్వే చేపడుతారని తెలిపారు. సమావేశంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలి

బిచ్కుంద, ఆగస్టు 29: విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ అన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ వసతి గృహాలతోపాటు జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలను ఆయన గురువారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. 18ఏండ్లు నిండిన వారితో ఓటరు నమోదు కోసం దరఖాస్తులను స్వీకరించాలని సూచించారు. అంతకుముందు పుల్కల్‌లోని ప్రభుత్వ దవాఖానను తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో ఎంపీవో గోపాల కృష్ణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ గౌడ్, వార్డెన్లు సంగీత, చంద్రకాంత్, క్రిష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

PASSPORT LOST

★దుబ్బాక నరేష్ S/o దుబ్బాక నడిపి గంగాధర్ H.No:2-53, గగ్గుపల్లి, ఆర్మూర్ మండలం, నిజామాబాద్. నేను ఆర్మూర్ నుండి గగ్గుపల్లికి బైక్‌పై వెళ్తుండగా K4734291 నం|| గల పాస్‌పోర్టు పోయినది దొరికిన వారు సం|| 97052 27025.
NTZ-340275

CHANGE OF NAME

★I, METHARI SUPRIYA, R/o. H.No. 6-61/4, Velpoor, (D) Nzb. Changed my Surname/ Name as NANDIPETA VASAVI W/o.NANDIPETA SATHEESH
NTZ-340370

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా వివరించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రుణమాఫీపై సర్వే

నాగిరెడ్డిపేట, ఆగస్టు 29: రుణమాఫీ కాని రైతుల నిర్ధారణ కోసం గురువారం నాలుగు గ్రామాల్లో సర్వే నిర్వహించినట్లు ఏవో హరివెంకట ప్రసాద్ తెలిపారు. మండలంలోని పోచారం, వదల్పర్తి, మాల్తుమ్మెద, గోలిలింగాల గ్రామాల్లో సర్వే చేపట్టి పూర్తి వివరాలు సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేశామని చెప్పారు. నేడు(శుక్రవారం) జప్తి జానకపల్లి, రాఘవపల్లి, బొల్లారం గ్రామాల్లో సర్వే ఉంటుందని తెలిపారు. ఆయనవెంట ఏఈవో ప్రశాంత్‌కుమార్ ఉన్నారు.

కొనసాగుతున్న పనులు

లింగంపేట, ఆగస్టు 29: మండల కేంద్రంలోని నాగన్న బావి వద్ద చేపడుతున్న అభివృద్ధి పనులను ఎంపీడీవో నరేశ్ గురువారం పరిశీలించారు. బావిలో భూగర్భ జలాలు పెంపొందించడానికి చర్యలు తీసుకుంటున్నారు. బావి పరిసరాల్లో నీరు వృథా పోకుండా భూమిలోకి ఇంకేలా పనులు చేపడుతున్నారు. కామారెడ్డి – ఎల్లారెడ్డి ప్రధాన రహదారి నుంచి బావి వద్దకు రహదారి నిర్మిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. అనంతరం ఆయన రాంపూర్, భవానీపేట, ముంబాజీపేట గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.

31న అంబేద్కర్ యువజన సంఘం ఎన్నికలు

సమావేశంలో మాట్లాడుతున్న అంబేద్కర్ యువజన సంఘం నాయకులు

ఎల్లారెడ్డి, ఆగస్టు 29: అంబేద్కర్ యువజన సంఘం ఎల్లారెడ్డి డివిజన్ ఎన్నికలు ఈనెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంఘం బాధ్యులు తెలిపారు. ఎల్లారెడ్డిలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికలకు డివిజన్‌లోని అన్ని అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు విధిగా హాజరు కావాలని సూచించారు. ఎల్లారెడ్డి, లింగంపేట, నాగిరెడ్డిపేట, గాంధారి మండలాల్లోని బాధ్యులు ఎన్నికల్లో పాల్గొనాలని కోరారు. ఎల్లారెడ్డిలోని కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి బిట్ల సురేందర్, అట్లూరి బబ్లూ పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

లింగంపేట, ఆగస్టు 29: మండలంలోని ఐలాపూర్ గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం వైద్య పరీక్షలు నిర్వహించినట్లు హెచ్ఎం దామోదర్ తెలిపారు. రాష్ట్రీయ బాల్ స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా 63 మంది విద్యార్థులను పరీక్షించి, అవసరం ఉన్న వారికి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు నిక్కత్, క్రాంతి కుమార్, ఫార్మాసిస్టు ఉమారాణి, స్వప్న, ఉపాధ్యాయులు పద్మ, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

అల్లూరమ్మ ఆలయంలో చోరీ

లింగంపేట, ఆగస్టు 29: మండలంలోని కోమట్‌పల్లి గ్రామ శివారులో ఉన్న అల్లూరమ్మ ఆలయంలో చోరీ జరిగిందని గ్రామస్తులు గురువారం తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ ప్రధాన ద్వారానికి ఉన్న తాళం పగుల గొట్టి లోనికి ప్రవేశించారన్నారు. ఆలయం లోని హుండీని ధ్వంసం చేసి, అందులోని నగదును ఎత్తుకెళ్లినట్లు చెప్పారు. గురువారం ఉదయం గుర్తించిన గ్రామస్తులు చోరీ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఓటరు జాబితా విభజన పరిశీలన

లింగంపేట, ఆగస్టు 29: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో వార్డుల వారీగా చేపడుతున్న ఓటర్ల విభజనను మండల పంచాయతీ అధికారి మలహరి గురువారం పరిశీలించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కోసం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అన్ని పంచాయతీల పరిధిలో కార్యదర్శులు, బీఎల్‌వోలు వార్డుల వారీగా ఓటర్ల విభజన చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. సెప్టెంబర్ 6వ తేదీ వరకు అన్ని పంచాయతీల తుది ఓటర్ల జాబితాను ప్రకటించనున్నట్లు ఎంపీవో వెల్లడించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సన్మానం